# ఆదర్శాల చిమ్మ చీకటి

ఆ పక్కనే కాలవ. ఆ కాలవ ప్రవాహాన్ని దాటివొచ్చే ప్రయత్నంలో పగలల్లా కమ్యూనిస్టు సైన్యాలు విఫలులైనా, పొద్దు గూకిన కొద్దీ విజయోన్ముఖులైనారనే ప్రభుత్వ సేనాధిపతులు అంచనా వేసుకున్నారు. దూరంగా డేరాల్లో కూచుని అంచానాలైతే సులభంగా వేస్తారు కాని, సైన్యాలుపడే బాధ అర్థమౌతుందా వాళ్ళకి? దూరంగా క్షితిజంనించి చీకటి చైనాభూభాగాన్ని ఆవరిస్తోంది. దానికి తోడుగా చలికూడాను. ఆ కాలవకి ఉత్తరపుగట్టున విప్లవోన్మత్తులైన చైనా ఎర్రసైన్యం; దక్షిణపు గట్టున ఉసూరు మనుకుంటో ప్రతిఘటన సాగిస్తున్న చైనా ప్రభుత్వ సైన్యం.

★ ★ ★

చీకటిలోంచి అవతలిగట్టున పేలే ఫిరంగుల దారుణాగ్నివర్షం కనిపిస్తోంది. దక్షిణపుగట్టున ఏవో పిచ్చిమొక్కల పొదల చాటున పడిపోయి దొర్లుతున్నాడు ఆ సైనికుడు. చీకట్లో ఖాకీ డ్రెస్సు నల్లగా, పిశాచికి మల్లే అతన్ని ఆవరించుకుని అతనికి అప్పజెప్పబడిన కర్తవ్యాన్ని, బలవంతంగా నిరూపిస్తోంది. అయినా అతను పక్కకు పడిపోయినాడు. అతను పడిపోయిన నేల తేమగా ఉంటానికి కారణం రక్తమూ కావొచ్చు; మంచు గాని కావచ్చు. స్పృహ లేకపోవటంవల్ల తుపాకీ దూరంగా పడివుంది. లేచి నిలబడే ఓపిక కొద్దో గొప్పోవున్నా, వీపుమీద వున్న భారమైన సామాగ్రివల్ల ఆ వోపిక నశిస్తోంది.

'దాహం...' చీకట్లోంచి, భయంకరమైన మారణాస్త్రాల మోతలనించి తప్పించుకుని, అతని గొంతులోంచి జీరగా, బాధగా ఆ ఒక్కమాట వెలువడింది. అతని ఊహలన్నీ మెల్లగా మేల్కొంటున్నై. తానున్నది యుద్ధరంగంలో గదూ?... తన దాహం సంగతి ఎవరికి పట్టింది? అయినా రెండు రోజుల క్రితం ఆహారం సప్లయి ఆగిపోయిందని చెప్పారు. అయితే ఈ యుద్ధాన్ని ఆపెయ్యగూడదూ?.... ఎత్తిన తల చప్పున వంచాడు. ఒక ఫిరంగిగుండు పొదల్లోగుండా దూసుకుని చెవి దగ్గరగా పోయింది. అదృష్టమే.

కాలులోంచి దూసుకుపోయిన గుండు. బాధగూడా ప్రారంభమైంది ఆలోచనలకేనా వ్యవధివ్వకుండా. మూలుగుతున్నాడు.

'ఎవరది...?' పక్కనే ఎవరిదో కొత్త స్వరం విని ఉలిక్కిపడ్డాడు. ' ఎవరు బాబూ, మీదగ్గిర వాటర్ బాటిల్ వుందా?' దీనంగా, దాహంగా వినపడ్డది నూతనుడి స్వరం. ఎడంవైపు రెండు గజాల్లో ఉన్నాడేమో? వెంటనే చేరుకున్నాడు.

'ఎక్కణ్ణించి మాట్లాడుతున్నావు?' తన స్వరం వినపడుతుందో లేదో అనుమానంగానే వుంది.

'ఇక్కడే...' దగ్గరగా దొర్లుకుంటూ వొచ్చింది ఒక మానవశరీరం. ఆ కటిక చీకట్లో ఆకారాన్ని మాత్రమే పోల్చుకోగల్గాడు గాని ఇంకేమీ కన్పట్టంలేదు.

'నా దగ్గరా నీళ్లు అయిపోయినై. నేను అల్లాడుతున్నాను దానికోసమే. ఇక మరీ ప్రాణంమీదికి వొస్తే నెత్తురు తాగాల్సిందేమో...' విసుగ్గా, చిరాకుగా అన్నాడు మొదటి సైనికుడు.

రెండవ సైనికుడు నవ్విన నవ్వు ఫిరంగి మోతలో వినిపించలేదు.

'నువ్వు ఏవూరు?' నవ్వాపి, కొత్త సైనికుడు కనుక్కున్నాడు తన పరిచితుణ్ణి.

నాదా? ట్టీన్‌సీన్ పక్కనే చిన్నగ్రామంలే. దానికేంగాని, నువ్వు శుభ్రంగా మాట్లాడుతున్నావు గదా, పడుకున్నావేం తుపాకీ కాల్చకుండా?' మొదటి సైనికుడిలో, ఇంకా ప్రభుత్వభక్తి నశించలేదు. నీరసంగా పనిచేస్తోంది రక్తంలో

' ఏం చెయ్యనుమరి? తిండీ తిప్పలూ లేకుండా, తుపాకీ ఎట్లా లేస్తుందంటావు?'

తూర్పున చంద్రబింబం మందమైన కాంతితో ఉదయిస్తోంది. విజయాసక్తితో ఇరుపక్షాలూ చేస్తున్న మారణహోమం కొద్దిగా కనిపిస్తోంది.

'మేమంతా చెయ్యగాలేనిది నీకే వొచ్చిందా అంతనీరసం?' మొదటి సైనికుడు కొంచెం మందలింపుగా విమర్శించాడు. నూతనుడి మొహంమీద నవ్వు మందమైన వెన్నెట్లో కనిపించింది.

'అవును గాని, ఎన్ని నెలలనించి జీతం ఇవ్వటం లేదు మనకు, తెలుసా? ఇంటిదగ్గర నా వాళ్లు తిండి లేక మాడిపోతోంటే, నేను ఏ ఆదర్శంకోసం యుద్ధంచెయ్యాలో నా కర్థం గావటం లేదు'.

రెండవ సైనికుడికి ఈ మాటలు తుపాకీ గుండ్లల్లే తగిలాయి. నిజమే! తన ఇద్దరు పసిపిల్లలూ, భార్యా, ఏమైనారో.... ఆరునెల్ల జీతంరావాలి. ఎందుకని జీతం ఇవ్వరు? అమెరికానించి అన్ని డాలర్లు వొచ్చినైగా!... అతని ఆలోచనలు పైకి పొక్కినై.

'అయితే ఇన్నాళ్ళనించి జీతం ఎందుకని ఇవ్వటంలేదంటావు?' ఈ ప్రశ్నవెనక శారీరకబాధ చేత, మూలుగు, నీరసం, వొణుకూ ధ్వనించినై. బహుశా రక్తం చాలినంతలేదు అతని శరీరంలో.

' ఏమో? నాకు మాత్రం తెలుసా? అయితే మనరెజిమెంటు సోల్జర్లు చాలామంది ఒకమాటన్నారు!' ఆగిపోయినాడతను, వాళ్ళపక్కనించి రెండు టాంకులూ, ఇరవైమంది సైనికులు పరిగెత్తడంవల్ల! హైగా పైన విమానాల రొద జాస్తయింది.

' ఏమన్నారు?' ఆదుర్దాగా ఆసక్తిగా కనుక్కున్నాడు అవసానదశలో ఉన్న మొదటి సైనికుడు. చిట్టచివరగా ఏదో కొత్త సంగతీ, అందులో నూతన జీవిత సమస్యకు సంబంధించినదీ ఐన సంగతి వినాలనే కోర్కె అతనిలో పనిచేస్తోంది.

'నేను చెప్పేది అందరికీ తెలిసిన రహస్యమే. నీకు తెలీదంటే ఆశ్చర్యంగా ఉంది. జీతం మొత్తాలేమో, సైన్యాధికారులకి వొస్తున్నాయి. కాని సైనికులకి రావటం లేదు.'

'అంటే.'

'అంటేనా? అంటే ఈ కర్నల్సూ. జనరల్సూ మింగుతున్నారు.'

'అయితే మనం యుద్ధం చెయ్యడం ఎందుకూ?'

'అదే నిన్నటిదాకా నాకూ అర్థంకాని విషయంగా ఉండేది. ఇవ్వాళ బోధపడ్డది.'

'ఏం తెలిసింది?' మొదటి సైనికుడి గొంతు సరిగా వినపట్టంలేదు. మరణావస్థపడుతూనే తను ఎవరికోసం మరణిస్తున్నాడో తెలుసుకోవాలని కుతూహల పడుతున్నాడు.

'వ్యాపారస్థుల లాభాలూ, భూస్వాముల భూములూ సురక్షితంగా ఉండేందుకూ, జనం ఆకలితో మాడి చచ్చేందుకున్నూ.'

'నిజమా?' మృత్యుముఖంలో అర్థమై, కానీ మాటలకి ఆశ్చర్యమూ కోపమూ కలిసిన సమాధానం ఇచ్చి మొదటిసైనికుడు కళ్లు మూశాడు.

రెండవ అతనికి ఈ సంగతి తెలీదు. అతను చెప్పుకుపోతున్నాడు. 'నిజమా? నువ్వూ నేనూ బతుకున్నంతనిజం. అందుకనే మన సైన్యాలు ఎక్కడికక్కడికే ఓడిపోతున్నాయి... ఓడిపోతున్నాయా? పొరపడ్డాను. అవతలి సైన్యాలతో కలిసిపోతున్నాయి. ఇటు విను మిత్రమా! మన రెజిమెంటుకూడా ఇంకా రెండు గంటలలో అవతల వాళ్ళతో కలిసేట్టుంది....' ఉత్సాహంతో అన్నాడు అతను.

సమాధానం గాని, వింటున్నట్టు సంజ్ఞగాని లేక పోయ్యేప్పటికి మాట్లాడుతున్నవాడు ఆగిపోయి శవంవైపు చెయ్యిచాపి చూశాడు. చల్లగా తగిలింది.

'పాపం....' అని మాత్రం అనేసి అతను తన రిస్టువాచిలో మెరుస్తున్న అంకెలవంక చూశాడు. ఎనిమిదిన్నర అవుతోంది. 'ఇంకా గంట వ్యవధి ఉంది... కార్యక్రమానికి' అంటూ, పాదలపక్క నించి ఆ సైనికుడు కాలవవైపు పాకుతూ మసకవెన్నెట్లో కలిసిపోయాడు.

***(ఫిబ్రవరి 4, 1949, తెలుగు స్వతంత్ర)***